సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 8 । జూన్ । 2025



హోరాహోరీగా హాకీ పోటీలు

భీమవరంలో 15వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి బాలికల హాకీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. పలు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొంటున్నాయి. 10లో ▸



చెరువు మట్టి అక్రమార్కుల పాలు

పొలంలో మెరక నిమిత్తం మట్టి కావాలనే అనుమతులతో చెరువు మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయిస్తూ టీడీపీ నాయకులు జేబులు నింపుకుంటున్నారు. 10లో ▸



గంజాయి రవాణా.. నలుగురి అరెస్ట్

వ్యసనాలకు బానిసలై, గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను గణపవరం పోలీసులు అరెస్ట్ చేశారు. 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

ఫీజుల దోపిడీని అరికట్టాలి



భీమవరంలో విద్యాశాఖ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ ప్రారంభించారని, విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. శనివారం భీమవరం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్డూ అదుపు లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,800, పట్టణ ప్రాంతాల్లో రూ.9 వేల లోపు, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.12 వేలలోపు మాత్రమే ఫీజులు వసూలు చేయాల్సి ఉందన్నారు. అంతకంటే ఎక్కువ ఫీజులు వసూలు చేయాలంటే పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ ఆమోదంతోపాటు జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ ఆమోదం పొందాల్సి ఉందన్నారు. అయితే ఇవేమీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇవ్వాలనే నిబంధనలను కొన్ని విద్యాసంస్థలు పాటించడం లేదన్నారు. ఏఐఎస్ఏ నాయకులు పుల్లూరి రాంప్రసాద్, ఎం.రాజు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

భీమవరం: జిల్లాలో గతనెలలో నిర్వహించిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలైనట్టు శనివారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు చెప్పారు. ఫస్టియర్ జనరల్ పరీక్షలకు 4,456 మంది విద్యార్థులు హాజరుకాగా 1,740 మంది, ఒకేషనల్ పరీక్షలకు 721 మంది హాజరుకాగా 336 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. సెకండియర్ జనరల్ పరీక్షలకు 3,008 మంది హాజరుకాగా 1,542 మంది, ఒకేషనల్ పరీక్షలకు 377 మంది హాజరుకాగా 336 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు 47 శాతంతో 2,146 మంది, సెకండియర్ విద్యార్థులు 60 శాతంతో 1,623 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 4,089 మందికి 1,787 మంది, ఒకేషనల్ విద్యార్థులు 734 మందికి 359 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షల్లో 2,423 మందికి 1,350 మంది, ఒకేషనల్ విద్యార్థుల్లో 534 మందికి 273 మంది ఉత్తీర్ణులయ్యారు.

9 నుంచి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు అవకాశం ఉందని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు రూ.1,300, రీ కౌంటింగ్‌కు రూ.260 ఫీజు చెల్లించాలన్నారు.

9న 'షైనింగ్ స్టార్స్' అవార్డులు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించి, నగదు పురస్కారం అందించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో శనివారం కార్యక్రమం నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 9న ఉదయం 9.30 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అరాచకాలు.. దౌర్జన్యాలు

కూటమి కక్ష సాధింపులు

- ఏడాది పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లే లక్ష్యం
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ఎత్తుగడ
- జిల్లాలో 37 మందిపై అక్రమ కేసులు



అత్తిలిలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎన్నికకు హాజరు కాకుండా మాజీ మంత్రి కారుమూరి నివాసాన్ని ముట్టడించిన కూటమి శ్రేణులు (ఫైల్)

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, భీమవరం: ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తోంది. పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలు, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తోంది. ప్రజల గొంతుకగా ప్రశ్నిస్తున్న వారిని వేధింపులకు గురిచేస్తోంది. జిల్లాలోని దాదాపు 37 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించింది. కూటమి నేతలు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాలు పేకాట స్థావరాలకు నిలయంగా మారాయన్న విమర్శలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటున్నారు.

పదవుల కోసం కుతంత్రాలు

ఇటీవల అత్తిలి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా కూటమి కుట్ర రాజకీయాలు బయటపడ్డాయి. అత్తిలి మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్‌సీపీకి 13 సభ్యుల సంఖ్యాబలం ఉండగా, కూటమికి ఆరుగురే ఉన్నారు. ఎన్నికలు సవ్యంగా జరిగితే ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా వైఎస్సార్‌సీపీ సభ్యుల ఎన్నిక లాంఛనమే. కాగా కుట్ర రాజకీయాలతో పదవులు కాజేసే ఎత్తుగడ చేశారు. మెజార్టీకి అవసరమైన సభ్యులను తమ వైపు తిప్పుకోవడం ద్వారా విలువలకు నీళ్లొదిలి పదవులను దక్కించుకున్నారు. అత్తిలి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అల్లరి మూకలు, కూటమి శ్రేణులతో మాజీ మంత్రి కారుమూరి నివాసాన్ని చుట్టుముట్టి వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎన్నికకు హాజరుకాకుండా అడ్డుకోవడం కూటమి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంగా నిలిచింది. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా కూటమి దౌర్జన్యంపై ఎస్సై నుంచి డీజీపీ వరకు కారుమూరి ఫోన్లు చేసి వివరించే ప్రయత్నం చేసినా ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. యలమంచిలి ఎంపీపీ ఎన్నికలో పదవుల కోసం కూటమి కుట్రలు ఫలించలేదు. పోలీసులు, కూటమి నేతలను అడ్డం పెట్టుకుని సామదాన దండోపాయాలు చేసినా వైఎస్సార్‌సీపీ సభ్యులు తలొగ్గకపోవడంతో కూటమి తోక ముడవక తప్పలేదు.

ఆటోడ్రైవర్‌పైనా జులుం

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలి కానురుకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త, ఆటో డ్రైవర్ పంజా దుర్గారావు తణుకు, నిడదవోలు పట్టణ రాజకీయాల్లో యాక్టీవ్‌గా ఉంటూ వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా పోస్టులు పెడుతుంటారు. జనవరి 17న తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అతని ఆటోని అడ్డగించి, వ్యతిరేకంగా పోస్టులు పెడతావా అంటూ దుర్భాషలాడారు. రవాణా శాఖ అధికారులను పి లిచి ఆటో సీజ్ చేయించారు. దుర్గారావుకు జ రిమానా విధించిన పోలీసులు 41 నోటీసు ఇచ్చి విడుదల చేశారు. 12 గంటలకుపైగా పోలీస్‌స్టేషన్‌లో ఉంచి దుర్గారావు పెట్టిన పోస్టులను పరిశీలించారు.



కుట్రలు.. కేసులు

- ఏప్రిల్ 8న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఏలూరులో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారని టీడీపీ నాయకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.
- పాలకొల్లులో టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్ల పంపిణీ సందర్భంగా 2022 ఆగస్టు 5న నాటి టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సమావేశంలో జరిగిన గొడవపై రెండేళ్ల తర్వాత 2024 డిసెంబర్ 13న పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేత యడ్ల తాతాజీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ నేత గుణ్ణం నాగబాబులతో పాటు మొత్తం 24 మందిపై కేసు నమోదు చేశారు.
- మార్చి 28న యలమంచిలిలో ఎంపీపీ ఎన్నిక సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తనను కులం పేరుతో దూషించినట్టు టీడీపీ నేత ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే ఎంపీపీ ఎన్నిక సమయంలో తమ విధులకు ఆటంకం కలిగించారని, వీఆర్‌ఓ విధులకు అడ్డుకున్నారని పోలీసులు కేసులు నమోదు చేశారు.
- సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న వారిపైన కూటమి కక్ష కట్టింది. రెండేళ్ల క్రితం తమ పార్టీ నేతలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ కూటమి నేతల ఫిర్యాదులపై భీమవరానికి చెందిన పి.శ్రీనివాస్, బి.జయరామ్, జి.మురళీకృష్ణ, ఉండికి చెందిన జి.సుందర్‌కుమార్, కె.దొరబాబు, కె. మహేష్ తదితరులపై కేసులు నమోదయ్యాయి.

శ్రీవారి అంతరాలయ దర్శనం రద్దు

- చిన వెంకన్న క్షేత్రం.. భక్త జన సంద్రం
- 5 గంటల పాటు నిలిపివేసిన అంతరాలయ దర్శనం

ద్వారకాతిరుమల: భక్తుల రద్దీ దృష్ట్యా ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం అధికారులు స్వామి వారి అంతరాలయ దర్శనాన్ని శనివారం ఐదు గంటల పాటు రద్దు చేశారు. దీంతో ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వచ్చిన వారికి, వీఐపీలకు షాక్ తగిలింది. కాగా అధికారులు తీసుకున్న నిర్ణయంపై సామాన్య భక్తులు హర్షం వ్యక్తం చేశారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. రద్దీ దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి అంతరాలయ దర్శనాన్ని రద్దు చేయాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి ఆదేశించారు. అంతే కాకుండా అధిక సమయం అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఎవరైనా ఈ నిర్ణయాన్ని అతిక్రమిస్తే చర్యలు చేపడతానని తీవ్రంగా హెచ్చరించారు. అదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో వచ్చిన వారికి, వీఐపీలకు చుక్కెదురైంది. అయితే అధికారులు వారికి నచ్చజెప్పి కొండపైన గదుల్లో వసతి కల్పించి, మధ్యాహ్నం నుంచి అంతరాలయ దర్శనం చేయించారు.



భక్తులతో కిక్కిరిసిన ఉచిత ప్రసాదం క్యూలైన్లు

సౌకర్యాలపై ఆరా : భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఈఓ సత్యనారాయణమూర్తి స్వయంగా పరిశీలించారు. ఆలయంలో భక్తుల వద్ద ఉన్న దర్శనం టికెట్లను ఆయన పరిశీలించారు. నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడి, రుచి, నాణ్యతపై ఆరా తీశారు. ప్రసాదం కౌంటర్లు, ఇతర విభాగాలను తనిఖీ చేశారు.

రూ.43 లక్షలు ఆదాయం: శ్రీవారిని 30 వేల మంది భక్తులు దర్శించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, స్వామివారి నిత్యార్జిత కల్యాణాలు, విరాళాలు, ఇతర సేవా రుసుముల ద్వారా రూ.43 లక్షల ఆదాయం సమకూరిందన్నారు.

క్షేత్రం కిటకిట.. హరినామమే అందరి నోట

శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రాన్ని తలపించింది. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తుల రాక మొదలైంది. దీంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. అనివేటి మండపంలో భజన మండలి సభ్యుల కోలాట నృత్యాలు అలరించాయి. స్వామివారి కొండపైన ఘాట్ రోడ్డులో భక్తుల వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రాత్రి వరకూ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.



ఘాట్‌రోడ్డులో వాహనాల రద్దీ

శుభ కార్యాలకు విరామం

- నేటి నుంచి 48 రోజులపాటు బ్రేక్
- జూలై 26 నుంచి మళ్లీ ముహూర్తాలు



ద్వారకాతిరుమల: పెళ్లి పనులు ప్రారంభించడం దగ్గర నుంచి అన్ని పనులకు ముహూర్తాలు చూస్తారు. అటువంటి ముహూర్తాలకు 48 రోజుల పాటు బ్రేక్ పడింది. ఈ ఏడాది జనవరి 30 నుంచి జూన్ 7 వరకు వివాహాలు జోరుగా జరిగాయి. ఆయా ముహూర్తాల్లో జిల్లావ్యాప్తంగా వేలాది వివాహాలు నిర్వహించారు. ఈనెల 10 నుంచి గురు మూఢమి, 26 నుంచి ఆషాఢ మాసం కావడంతో జులై 25 వరకు పెళ్లి సందడికి విరామం వచ్చింది. తిరిగి వివాహ ముహూర్తాలు శ్రావణ మాసం జూలై 26 నుంచి ప్రారంభం కానున్నాయి. అప్పటివరకు వివాహాది శుభకార్యాలకు ఆగాల్సిందే.

48 రోజులు పనులు లేనట్టే..

వివాహాది శుభకార్యాలపై ఆధారపడి జీవనోపాధి పొందే పురోహితులు, పచ్చిపూల మండపాలు, డెకరేషన్, షామియానా పందిళ్లు నిర్మించే వారు, వాయిద్యకారులు, క్యాటరింగ్, లైటింగ్ కార్మికులకు 48 రోజుల పాటు పనులు లేనట్టే. వీరంతా మళ్లీ జులై 26 నుంచి బిజీ కానున్నారు.

వివాహ ముహూర్తాలు : వివాహాలకు ఈ ఏడాది జూలై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17, సెప్టెంబర్ 23, 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబర్ 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.

శ్రావణం వరకూ ఆగాల్సిందే..



ఈనెల 10 నుంచి గురు మూఢమి. అలాగే 26 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం అవుతుంది. దీంతో ఆషాఢ మాసం ముగిసే వరకూ వివాహాలు చేసుకునే వారు ఆగాల్సిందే. శ్రావణ మాసమైన జూలై 26 నుంచి బలమైన ముహూర్తాలు ఉన్నాయి. నవంబరు తర్వాత మళ్లీ ముహూర్తాలు లేవు.

– గోవింద వఝుల వెంకటరమణ మూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల



పెనుగొండలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

భక్తి, త్యాగం, మానవతా విలువలకు ప్రతీక గా నిలిచే బక్రీద్ వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేశారు.

–పెనుగొండ

బదిలీల జాతర

ఏలూరు(మెట్రో): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లాలో బదిలీలు చేపట్టారు. జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, సీని యర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.చెల్లన్న దొర	తహసీల్దార్, కొయ్యలగూడెం	సూపరింటెండెంట్, కలెక్టరేట్
జి.విజయ్‌కుమార్‌రాజు	స్పెషల్ తహసీల్దార్, ఏలూరు	తహసీల్దార్, ఏలూరు రూరల్
పి.రవికుమార్	సూపరింటెండెంట్, కలెక్టరేట్	స్పెషల్ తహసీల్దార్, మెజిస్టీరియల్ సెక్షన్
ఎండీ నజీముల్లా షా	సూపరింటెండెంట్, కలెక్టరేట్	తహసీల్దార్, లింగపాలెం
జీవీ శేషగిరి	తహసీల్దార్, ఏలూరు అర్బన్	సూపరింటెండెంట్, కలెక్టరేట్
ఎస్.రంగలక్ష్మి	పోలవరం యూనిట్–2	పెదపాడు డీటీ
ఎ.ప్రమోద్‌కుమార్	పెదపాడు డీటీ ఏజీపీఓ	ఎపిక్ డీటీ, ఏలూరు
ఎస్.రాధాకృష్ణ	జీలుగుమిల్లి డీటీ	రీసర్వే డీటీ, కొయ్యలగూడెం
వై.సుమర్చన	రీసర్వే డీటీ, కొయ్యలగూడెం	రీ సర్వే డీటీ, బుట్టాయగూడెం
వీవీ పెద్దిరాజు	రీసర్వే డీటీ, కుక్కునూరు	రీ సర్వే డీటీ, జీలుగుమిల్లి
పి.కుమరేశ్వరరావు	రీసర్వే డీటీ, డి.తిరుమల	రీ సర్వే డీటీ, భీమడోలు
కె.సాయికిరణ్	రీసర్వే డీటీ, భీమడోలు	రీ సర్వే డీటీ, ఏలూరు ఆర్డీఓ ఆఫీస్
ఎం.ఉమామహేశ్వరరావు	సీఎస్‌డీటీ, ఏలూరు	డీటీ కైకలూరు
ఎస్.పోతురాజు	ఎస్‌డీటీ ఆర్డీఓ, ఏలూరు	ఎపిక్ డీటీ ఉంగుటూరు
పి.నజీమాబేగం	ఎపిక్ డీటీ, ఉంగుటూరు	ఎస్‌డీటీ, ఏలూరు ఆర్డీఓ ఆఫీస్
జి.రామనాథ్‌బాబు	ఎపిక్ డీటీ, పోలవరం	ఎస్‌డీటీ, పోలవరం యూనిట్–2
ఎ.శ్రీనివాసరావు	డీటీ ఏలూరు రూరల్	డీటీ దెందులూరు
ఏవీఆర్ ప్రియదర్శిని	డీటీ దెందులూరు	డీటీ ఏలూరు రూరల్
ఎం.జ్యోతి	ఎస్‌ఏ, జంగారెడ్డిగూడెం	ఎస్‌ఏ, కుక్కునూరు
ఎస్.వెంకటేశు	ఎస్‌ఏ, కుక్కునూరు	ఎస్‌ఏ, జంగారెడ్డిగూడెం
పి.నయోమి	ఎస్‌ఏ, పెదపాడు	ఎస్‌ఏ, కలక్టరేట్
బి.దుర్గారావు	ఎస్‌ఏ, కలెక్టరేట్	ఎస్‌ఏ, పెదపాడు
టి.నాగరాజు	ఎస్‌ఏ, కొయ్యలగూడెం	డీజీఎస్‌ఓ, ఏలూరు
కేఎస్ఎల్ నారాయణ	ఎస్‌ఏ, కలెక్టరేట్	ఎస్‌ఏ, ఉంగుటూరు
బి.దావీదురాజు	ఎస్‌ఏ, ఉంగుటూరు	ఎస్‌ఏ, దెందులూరు
ఎస్ఎస్ సత్యకృష్ణవేణి	ఎస్‌ఏ, కలెక్టరేట్	ఎస్‌ఏ, ఏలూరు రూరల్
పి.శిరీష	ఎస్‌ఏ, కలెక్టరేట్, భీమవరం	ఎస్‌ఏ, కలెక్టరేట్, ఏలూరు
జె.వెంకటేష	ఎంఆర్ఐ కుక్కునూరు	ఎస్‌ఏ, వెస్ట్‌గోదావరి

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల గళం

యలమంచిలి: ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీకి భిన్నంగా విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ బదులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ తీసుకునే అసంబద్ధ నిర్ణయాలను ఖండిస్తూ ఉపాధ్యాయ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బదిలీల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాస్, ఎస్టీయూ సంఘ అధ్యక్షుడు రుద్రరాజు బాల విజయవర్మ, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, అవధాని, విజయానంద, సత్యనారాయణ, రాంబాబు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలిలో ఉపాధ్యాయుల నిరసన



పోడూరులో నిరసన తెలుపుతున్న టీచర్లు

పోడూరులో..

పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయుల బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఎంవీ రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పోడూరులో మండల ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని, రెండు జిల్లాల్లో ఖాళీలకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇవ్వడం కష్టమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ జి.విజయకుమార్, మండల అధ్యక్షుడు డి.క్షేమమూర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘాల సభ్యులు బి.శేషగిరిరావు, కె.పెద్దిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింహవాహనంపై గ్రామోత్సవం


ఈడూరులో సింహవాహనంపై స్వామి గ్రామోత్సవం

అత్తిలి: మండలంలో ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరాల వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామికి నిత్యార్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. వేదపారాయణం నిర్వహించారు. సాయంత్రం సింహవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాల నడుమ శ్రీస్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిపారు. దండు శ్రీనివాసరాజు, ఉమాలక్ష్మిదేవి దంపతుల సౌజన్యంతో శ్రీవెంకటేశ్వర సంబరం నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు జరిపారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

గోదావరిలో పడి యువకుడి మృతి


మృతిచెందిన మొట్టెం చరణ్

కుక్కునూరు: గోదావరిలో స్నానం చేసేందుకు సరదాగా స్నేహితులతో దిగిన యువకుడు గోదావరిలో మునిగి మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని మాధవరం రేవు వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరుపాడు మండలం చాగరపల్లికి చెందిన మొట్టెం చరణ్ (20) శనివారం మధ్యాహ్నం కుక్కునూరు మండలంలోని బంజరుగూడెం గ్రామంలో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వివాహానికి హాజరయ్యాడు. భోజనం అనంతరం తిరుగు ప్రయాణంలో మాధవరం గ్రామంలో స్నేహితులు ఉండటంతో ఆగాడు. అక్కడ మరో నలుగురు స్నేహితులతో కలిసి గోదావరిలో ఈత కొట్టేందుకు దిగారు. దిగిన వారెవరికీ ఈత రాకపోవడం, చరణ్ లోతును గమనించకుండా ముందుకు వెళ్లడంతో ఒక్కసారిగా గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని స్థానిక జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టగా, రాత్రి 8 గంటల సమయంలో చరణ్ మృతదేహం లభ్యమైంది. కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

మండవల్లి: భర్తతో గొడవపడి ఇంట్లో ఉరేసుకుని వివాహిత మృతి చెందినట్లు ఎస్సై రామచంద్రరావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గున్ననపూడికి చెందిన సతీష్‌కు రాజేశ్వరితో వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. శనివారం భార్యా భర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం సతీష్ పనికి వెళ్ళిపోయాడు. మనస్థాపానికి గురైన రాజేశ్వరి మధ్యాహ్నం రేకుల షెడ్డుకు ఉన్న రాడ్డుకు చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

చెరువు మట్టి అక్రమార్కుల పాలు

- పొలం మెరక కోసం అనుమతులు.. వేరే అవసరాలకు తరలింపు
- ట్రక్కు రూ.1000 నుంచి రూ.1200కు అమ్ముకుంటున్న అక్రమార్కులు


నూజివీడు పెద్ద చెరువులో ట్రాక్టర్లలో మట్టిని నింపుతున్న జేసీబీలు


కొప్పుల వెలమపేటలో అభివృద్ధి పేరుతో పార్కులో పోసిన మట్టి

నూజివీడు: పొలంలో మెరక నిమిత్తం మట్టి కావాలని అనుమతులు తీసుకుని చెరువు మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయిస్తూ టీడీపీ నాయకులు జేబులు నింపుకుంటున్నారు. నూజివీడు పట్టణంలోని పెద్దచెరువులో పొలం మెరక చేసుకోవాలనే ముసుగులో అనుమతులు పొంది మట్టిని వాణిజ్య అవసరాలకు, ఇతర అవసరాలకు అక్రమార్కులు అమ్మేస్తున్నారు. రెండు రోజుల నుంచి అక్రమ మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నా ఇటు ఇరిగేషన్ అధికారులు గాని, అటు రెవిన్యూ అధికారులు గాని పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.1000 నుంచి రూ.1200కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పొక్లెయిన్‌కు టక్కులో మట్టిని పోసినందుకు రూ.150 ఇస్తుండగా మిగిలిన మొత్తం ట్రాక్టర్ కిరాయి కింద వసూలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇంత రేటు గతంలో ఎన్నడూ లేదని రాజకీయ వర్గాల్లోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మెరక నిమిత్తం అనుమతులు తీసుకొని..

పట్టణానికి చెందిన వీవీ కృష్ణారావు నూజివీడులోని సర్వే నెంబరు 871–3లోని ఎకరం విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని మెరక చేసుకునే నిమిత్తం అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్, స్థానిక ఇరిగేషన్ డీఈ సిఫార్సుల మేరకు ఇరిగేషన్ ఈఈ 1000 క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని వారి సొంత ఖర్చులతో తవ్వి తోలుకునేందుకు అనుమతి ఇచ్చారు. అది కూడా ఈనెల 1 వరకు మాత్రమే అనుమతినివ్వగా గత రెండు రోజుల నుంచి పెద్ద చెరువులోని మట్టిని అధికార పార్టీకి చెందిన నాయకులు యథేచ్ఛగా, విచ్చలవిడిగా తోలుతూ విక్రయిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ, ఇంజినీరింగ్ అధికారులు మట్టి తవ్వడానికి మార్కింగ్ ఇచ్చిన చోట నుంచి తవ్వకుండా నాయకులు వేరొక చోట తవ్వుతూ మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ వరకు మాత్రమే అనుమతి ఉండగా, ఈ నెల 6వ తేదీ నుంచి రెండు జేసీబీలతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ ఏఈ, డీఈ ఏమాత్రం పట్టించుకోకుండా టీడీపీ నాయకులకు జీ హుజూర్ అంటున్నారు. అధికార పార్టీ వారు కావడంతో అధికారులు కళ్లు మూసుకొని కూర్చుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో నుంచి తరలిస్తున్న మట్టిని అనుమతి తీసుకున్న పొలం మెరకకు ఉపయోగించకుండా పట్టణంలో ఎవరు కావాలంటే వారికి అమ్మేసుకుంటున్నారు. ప్రజల ఇంత పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతుంటే పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా వదిలేయగా, రెవిన్యూ అధికారులు సైతం ఇరిగేషన్ అధికారుల బాటలోనే నడుస్తున్నారు. పార్కు మెరక పేరుతో పెద్ద దోపిడీకి స్కెచ్ వేశారు. ఎలాంటి నిధులు మంజూరు కాకుండానే కొప్పుల వెలమపేటలో పార్కు అభివృద్ధి పనులను టీడీపీ నాయకుడొకరు చేస్తుండగా ఆ పార్కులోకి మెరక నిమిత్తం పెద్ద ఎత్తున మట్టిని తోలుతున్నారు. వాస్తవంగా నిధులు మంజూరయ్యాక టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను నిర్ణయించి వర్క్‌ఆర్డర్ ఇచ్చిన తరువాత పనులు చేయాల్సి ఉండగా, అలాంటివేమీ లేకుండానే పార్కు అభివృద్ధి అంటూ పనులు చేస్తున్నారు. తరువాత మెరక పేరుతో భారీ ఎత్తున బిల్లులు చేసుకోవడానికే ఇదంతా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

హోరాహోరీగా హాకీ పోటీలు


భీమవరంలో జరుగుతున్న హాకీ పోటీల్లో హోరాహోరీ తలపడుతున్న బాలికలు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో 15వ అంతర్‌జిల్లాల రాష్ట్ర స్థాయి బాలికల హాకీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 16 టీంలు పాల్గొంటున్నాయి. శనివారం నిర్వహించిన పోటీల్లో 13 జట్లు పాల్గొన్నాయి. వీటిలో కడప–ఎన్టీఆర్ జిల్లాల జట్ల మధ్య పోటీలో కడప 12 గోల్స్ చేసి విజయం సాధించింది. గుంటూరుపై అనంతపురం, కృష్ణాపై ప్రకాశం, పశ్చిమగోదావరిపై అనకాపల్లి జట్టు విజయం సాధించింది. శ్రీసత్యసాయి– నెల్లూరు మధ్య జరిగిన పోటీలో శ్రీసత్యసాయి జట్టు, తిరుపతి–నంద్యాల మధ్య పోటీలో తిరుపతి, విశాఖపట్నం–మన్యం జిల్లా మధ్య పోటీలో విశాఖపట్నం విజయం సాధించాయి. కాకినాడ–అన్నమయ్య జిల్లాల మధ్య పోటీలో ఎవరూ గోల్ చేయకపోవడంతో డ్రాగా ముగిసింది. 288 మంది క్రీడాకారులకు డీఎన్నార్ కళాశాల యాజమాన్యం వసతి కల్పించగా జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోజనం ఇతర సౌకర్యాలు కల్పించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనంద రాజు, కేవీఎస్ భరత్ చెప్పారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు


గణపవరం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రవణ్‌కుమార్

గణపవరం : చెడు వ్యసనాలకు బానిసలై, గంజాయి అమ్మకాలు చేస్తున్న నలుగురు యువకులు పోలీసుల వలలో చిక్కారు. గణపవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద పోలీసులు శనివారం ఉదయం మాటు వేసి గంజాయి అక్రమంగా రవాణాచేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.50వేల విలువైన 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన ఖార అర్జున్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ దొంగతనంగా గంజాయి అమ్మేవాడు. ఇతనికి గణపవరం వెలంపేటకు చెందిన రాయపురెడ్డి తరుణ్, ఇందిరమ్మ కాలనీకి చెందిన యాళ్ల సాయికిషోర్, ఉండిమండలం కోలమూరుకు చెందిన దగుగ్పల్లి జోగామారిష్ పరిచయం అయ్యారు. ఈ ముగ్గురు యువకులు గంజాయి సేవించడమే కాక, చుట్టుపక్కల యువకులకు గంజాయి అమ్మేవారు. ఈ ముగ్గురు యువకులు అర్జున్‌తో కలసి అరకు వెళ్లి గంజాయి కొని తెచ్చి స్థానికంగా అమ్ముతున్నారు. తనకు అందిన సమాచారం ఆధారంగా సీఐ సుభాష్ సిబ్బందితో కలసి మాటు వేసి వీరిని పట్టుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలోని దానమ్మగుడి సమీపంలో ఆటో డ్రైవర్ పద్మాకర్ ఇటీవల ఇంటి ముందు గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. శనివారం ఇది గమనించిన స్థానికులు కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎక్సైజ్ ఎస్సై రాంబాబు, పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసు పద్మాకర ఇంటికి వెళ్లి అక్కడి గంజాయి మొక్కలను పరిశీలించి నిర్ధారించారు. పద్మాకర్‌ను విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

గడ్డివాము దగ్ధం


ఆనందరావుపేట వద్ద బూడిదైన గడ్డివాము

కైకలూరు: అగ్నిప్రమాదంలో ఐదెకరాల గడ్డి వాము దగ్ధమైంది. ఈ ఘటన వింజరం – ఆనందరావుపేట రహదారిలో శుక్రవారం రాత్రి జరిగింది. వింజరం గ్రామానికి చెందిన కడవకొల్లు సూర్య సత్యనారాయణ చెందిన గడ్డి వాముకు మంటలు అంటుకున్నాయి. కొద్ది నిమిషాల్లోనే పూర్తిగా మంటలు వ్యాపించి మొత్తం గడ్డివాము కాలుపోయింది. సమీపంలో మద్యం దుకాణం ఉండటం వల్ల మద్యం తాగుతూ ఎవరైన సిగరెట్ పీక వేసారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం జరిగిన ఘటనపై కై కలూరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

- భూసారం వృద్ధి, చీడ పీడల నివారణ
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది


పాడి- పంట

బుట్టాయగూడెం : ఒకే పొలంలో ఒకే పంట సాగు ద్వారా దిగుబడులు తగ్గుతాయి. పంటల్లో ఎదుగుదల ఉండదు. చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. పంటల మార్పిడి ద్వారా భూసారం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులు సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారం నష్టపోకుండా అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మారిడితో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

ఒకే పంట సాగుతో నష్టాలు

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆ లోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడుల భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యత ఉండదు. ఫలితంగా గిటుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది.
- మార్కెట్ సమస్యలు ఎదురవుతాయి.


సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతు


రైతులకు పంట మార్పిడిపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే వ్యవస్థ ఉన్న పంట, తక్కువ లోతుకు చొచ్చుకు పోయే వేరు వ్యవస్థ ఉన్న పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. వరి, అపరాలు, జొన్న, పత్తి వంటి పంటలు వరుసగా వేయడం మంచిది.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవటం మేలు. ఉదాహరణకు మొక్క జొన్న, అపరాలు వంటి పంటలు.

పంట మార్పిడితో లాభాలు

పంట మార్పిడి విధానం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలి, వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయా చిక్కుడు తదితర పంటలు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రీయ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటలపై వచ్చే శిలీంధ్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియస్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడుపుల మాదిరి ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు



రైతులు ఏటా ఒకే పంట సాగు చేస్తున్నారు. వరి సాగు తప్ప వేరే పంట సాగు చేసేందుకు ఆశక్తి చూపడం లేదు. దీంతో వరి పంటలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని అధిగమించడానికి పంటల మారిడి విధానం ఉత్తమం. ఈ విధానంపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలి. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు ఒకసారి అనుభవంలోకి వస్తే ఈ విధానాన్ని రైతులు కొనసాగిస్తారు.

– డి.ముత్యాలరావు, మండల వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్: కుటుంబ కలహాల కారణంగా వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పెదపాటి దుర్గాప్రసాద్ (40) ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. ఇటీవల అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి మరో ఇంటికి మారాడు. అద్దె ఇంటిని పూర్తిగా ఖాళీచేసిన అనంతరం శనివారం ఉదయం పాత అద్దె ఇంటికి వచ్చి మోటారుసైకిల్‌ను బయట పార్కు చేసి ఇంట్లోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. ఎంతసేపటికి బైటకు రాకపోవడతో స్థానికులు తలుపులు తట్టారు. తలుపులు తీయకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్ళి చూడగా సీలింగ్ ఫ్యాన్ రాడ్డుకు ఉరివేసుకుని దుర్గాప్రసాద్ కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ ఎస్సై నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముదినేపల్లి మండలంలో మరొకరు

ముదినేపల్లి రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పేరూరులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బంటుమిల్లి మండలం దండ్లగూడెంకు చెందిన కుర్మా యోహోషువకు కైకలూరు మండలం కొట్టాడుకు చెందిన సంధ్యతో పదేళ్ళ క్రితం వివాహం జరిగింది. యోహోషువ పేరూరులో చేపల చెరువుపై పనిచేస్తున్నాడు. కుటుంబసభ్యులతో చెరువు వద్దే ఉంటున్నాడు. పది రోజుల క్రితం భార్య కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. యోహోషువ కొట్టాడకు వెళ్లి భార్యతో ఘర్షణ పడ్డట్లు తెలిసింది. యోహోషువ తన సోదరుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. సోదరుడు యోహోషువ భార్య వద్దకు వెళ్లి వివరాలు సేకరించి పేరూరుకు రాగా అప్పటికే గుడిసెలో దూలానికి ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొని యువకుడి మృతి


వడ్డిగూడెం సమీపంలో పంట పొలాల్లో పడిన సైదు సాయికృష్ణ గంగాప్రసాద్ (24) మృతదేహం

భీమడోలు: ఆగడాలలంక చానల్ రోడ్డులోని వడ్డిగూడెం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతిచెందాడు. ఆగడాలలంక వీఆర్వో సైదు గోపాలకృష్ణ రెండో కుమారుడు సైదు సాయికృష్ణ గంగాప్రసాద్ స్నేహితుడి రిసెప్షన్‌కు బైక్ ఏలూరు వెళ్లాడు. పార్టీ ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా వడ్డిగూడెం సమీపం మలుపు వద్ద ఒక్కసారిగా అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టాడు. సాయి కృష్ణ ఎగిరి పక్కనే ఉన్న పంటబోదెలో పడ్డాడు. తల రాయికి తగలడంతో మృతిచెందాడు. శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు గమనించి పోలీసులకు, తండ్రికి సమాచారం అందించారు. ఎస్సై వై.సుధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు.

ముడి పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ముడి పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలని ఏలూరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ, దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, పామాయిల్ రైతుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఈ సమావేశం ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మిల్లర్లకు, దళారులకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకం చేసుకున్న తర్వాత ప్రభుత్వాలు ధర నిర్ణయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. టన్ను పామాయిల్‌కు రూ.22 వేలు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నేతలు కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య, ఆర్.లక్ష్మణరావు, డి.ప్రభాకర్, ఎం.వసంతరావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నటుడు సుప్రీత్‌రెడ్డి


సినీ నటుడు సుప్రీత్‌రెడ్డి

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సుప్రీత్‌రెడ్డి (కాట్రాజ్) శనివారం మధ్యాహ్నం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించారు. అనంతరం అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. సుప్రీత్‌రెడ్డి ఛత్రపతి, మిర్చి, మర్యాద రామన్న, ఎక్స్‌ప్రెస్ రాజా, ఆగడు, బలుపు వంటి చిత్రాల్లో నటించారు.

క్లుప్తంగా

గోగులమ్మ తల్లికి మహాకుంభ నివేదన


గోగులమ్మ పూరిగుడిసె వద్ద మహాకుంభ నివేదన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. అమ్మవారికి పుట్టింటి వారు, అత్తింటి వారు నైవేద్యాలు సమర్పించారు. రాత్రి పూరి గుడిసె వద్ద ప్రతి ఇంటి నుంచి అత్తెసర అన్నం వండి మహాకుంభ నివేదన గావించారు. విశేష కార్యక్రమాలు జరిగాయి. సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం


వార్డులలో యోగా అభ్యాసం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మానసిక శక్తి పెరుగుతుందని, వివిధ వ్యాధులు దగ్గరకు చేరవని పలువురు సచివాలయం సెక్రటరీలు పేర్కొన్నారు. స్థానిక పాతూరు 10, 12 వార్డులలో శనివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. సచివాలయం ఉద్యోగులు, స్థానికులు దాట్ల జగన్నాథ రాజు, నల్లగంచు రాంబాబు, గుండుమోగుల సురేష్, కంచర్ల రాజా, స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి


వైద్యస్కీముల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: ఎరువుల వాడకం తగ్గించాలని పశుపాలన డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. వికసిత్ సంకల్పఅభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెంటపాడు పశువుల ఆసుపత్రివద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ మేరీ రాణి, మత్యసాగుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎ. దేవీ వరప్రసాద్‌రెడ్డిలు నీటి వినియోగం, ఆరోగ్యకరమైన మొక్కలు పై అవగాహన కల్పించారు. మండల పశువైద్యాధికారి మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెటర్నరీ కార్యక్రమాలకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

తాడేరు విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

భీమవరం అర్బన్: విలేజ్ క్లినిక్‌లకు ఏ రోగి వచ్చినా అన్ని రకాల వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాడేరులో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందిని వైద్యపరంగా అంశాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు రోగులు ఎంతమంది వస్తున్నారు? ఏయే మందులు అందు బాటులో ఉన్నాయి? అనేఅంశాలు ఆరా తీశా రు. రోగులపై నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు వస్తాయని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కుళాయిల నుంచి మురుగు నీరు వస్తోంది. 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబందిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే వాపోతున్నారు.

పేదింటికి చంద్ర గ్రహణం

- అప్పులపాలు.. మధ్యతరగతి బతుకులు
- ప్రభుత్వ తోడ్పాటు లేదు
- కొండెక్కిన ధరలు
- ఏడాదిగా నిలిచిన సంక్షేమం
- జగన్ హయాంలో నిలదొక్కుకున్న వైనం
- సంపాదనంతా వడ్డీలకే చెల్లు
- వ్యాపారాలు జరగక ఇబ్బందులు


తణుకులో జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకం ప్రారంభోత్సవానికి హాజరైన మహిళలు (ఫైల్)

తణుకు అర్బన్: ఉపాధి లేదు.. సంపాదన తగ్గింది.. ప్రభుత్వ సంక్షేమం ఆగింది.. నిత్యావసర సామగ్రి ధరలు కొండెక్కాయి. విద్యుత్ బిల్లులు భారీగా పెరి గాయి ఇంకేముంది మధ్యతరగతి వర్గాలు అప్పులు చేసుకుని వడ్డీలు కడుతూ కాలం వెళ్లదీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జగన్ ప్రభుత్వం అందజేసిన సంక్షేమంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఉండేదని కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో అన్ని రకాల ధరలు పెరిగిపోవడంతోపాటు మధ్య తరగతి వర్గాలకు ఎటువంటి ప్రోత్సాహం లేదంటూ మండిపడుతున్నారు. ఇటు సంక్షేమం అందించక మానవాళి మనుగడకు అవసరమైన సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో కుటుంబాలు పోషించుకోలేక చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోలేకపోతున్నామంటూ మధ్యతరగతి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు మొండిచేయి చూపి కార్పొరేటు వర్గాలు, పెత్తందార్లకు దోచిపెట్టే రోజులు వచ్చాయంటూ ప్రజానీకం విమర్శలు గుప్పిస్తున్నారు.

రూ. 3300 కోట్లు ఖర్చు..

గత జగన్ ప్రభుత్వ హయాంలో తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో అభివృద్ధి, సంక్షేమానికి రూ 3300 కోట్లు నిధులు వెచ్చించారు. ఇందులో భాగంగా అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, కాపు నేస్తం, రైతు భరోసా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు వంటి పథకాలు అర్హులకు ప్రతి ఏడాది నగదు జమ కావడంతో వారు తమ అవసరాల కోసం ఆ మొత్తాన్ని వినియోగించే పరిస్థితి ఉండేది. కానీ నేడు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో మధ్య తరగతి బతుకులు కునారిల్లుతున్నాయి.

వ్యాపారరంగం అతలాకుతలం

2019–24 మధ్య ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వ హయాంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా జరిగిన వ్యాపారాలు గత ఏడాది కాలంగా బోణీలు కూడా కాని దుస్థితిలో కొన్ని వ్యాపార సంస్థలు ఉండడం విశేషం. ఏ వ్యాపారస్థుని వద్దకు వెళ్లినా జనం దగ్గర డబ్బులు లేక ఏ సామాగ్రి కొనుగోలు చేయడంలేదంటూ బాహాటంగానే చెబుతున్నారు. ఐదేళ్లపాటు వివిధ సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాలకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడంతో ఆర్థికంగా నిలదొక్కుకుని అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసే పరిస్థితి ఉండగా నేడు సంపాదించిన సొమ్ము ఇళ్లు గడపడానికి కూడా సరిపోని పరిస్థితుల్లో పిల్లల అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో సగటు వ్యక్తి ఉన్నారు. దీంతో వ్యాపారాలు జరగక అధికశాతం దుకాణాలు మూతలు పడే పరిస్థితి నెలకొంది.

మధ్యతరగతి బతుకు భారంగా మారింది



మధ్యతరగతి వర్గాల బతుకులు భారంగా మారాయి. నేటి కూటమి ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సూపర్‌సిక్స్ వంటి పథకాలు ఏడాది గడిచినా అందకపోవడంతో మధ్యతరగతి వర్గాలు ఇబ్బందులు పడుతున్నారు. గత జగన్ హయాంలో ఐదేళ్లపాటు పారదర్శకంగా సంక్షేమం అందించడంతో వారంతా తమ సంపాదనతోపాటు అదనంగా అందిన సంక్షేమ నగదుతో వారి అవసరాలు తీర్చుకునే వెసులుబాటు ఉండేది. – మహమ్మద్ హబీబుద్దీన్, అత్తిలి

ఆ రోజులే బాగుండేవి



జగన్ ప్రభుత్వ హయాంలో అందిన సంక్షేమ పథకాలు చరిత్రలో నిలిచాయి. సంక్షేమ పథకాల లబ్ధితో మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యారు. ముఖ్యంగా చిన్నపాటి వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు పెట్టుకుని జీవనోపాధిని పెంచుకున్నారు. కానీ నేడు ఏడాది గడిచినా ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అందించకపోవడంతో మధ్య తరగతి వర్గాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. – నూకల కనకదుర్గ, తణుకు

వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో మదనగోపాలస్వామివారి సన్నిధిలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈనెల 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎల్ లోక్‌నాథ్ శ్రీనివాస్ చెప్పారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ


తాడేపల్లిగూడెం పట్టణం 2వ వార్డు మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో ముస్లిం సోదరులు శనివారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తూరు, కొండ్రుప్రోలు, ఆరుగొలను, జగన్నాథపురం, ఆరుళ్ల, అప్పారావుపేట, ఎల్. అగ్రహారం తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులకు హిందూ, క్రీస్తు విశ్వాసులు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు ముస్లిం సోదరులు తమ ఇళ్లల్లో చేసుకున్న వంటకాలను ఇరుగు పొరుగు వారికి పంచి పండుగను ఘనంగా నిర్వహించారు.

బక్రీద్ పండుగ త్యాగానికి, అంకిత భావానికి నిదర్శనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బక్రీద్ పండుగ త్యాగానికి, అంకిత భావానికి నిదర్శనమని పెద్ద మసీదు హనఫియా ఇమామ్ మొహమ్మద్ అన్వర్ ఖాసిమీ అన్నారు. పట్టణంలో శనివారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరిపారు. అన్వర్ ఖాసిమీ చే ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఇమామ్ మాట్లాడుతూ ప్రపంచ మానవళి సుఖ శాంతులతో సోదర భావంతో మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కలిసి మెలసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నౌషాద్ మొహిద్దీన్, మసీద్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ ఘనీ, సెక్రటరీ షాజహాన్, నానసా, సర్దార్ ఖాన్, షేక్ వలి, సర్తాజ్, బాషా, ఆటోవలి, రఫీ, బాబర్, రబ్బాని, మసీద్ పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.


మత ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

తణుకు అర్బన్: 2025–26 సంవత్సరానికిగాను తణుకు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కోడూరి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా యాతం నాగరాజకుమార్, వై.నారాయణరావు, కార్యదర్శిగా పితాని వెంకటరమణ, ఉప కార్యదర్శిగా బుద్దాల శ్రీనివాస్, కోశాధికారిగా మాకిరెడ్డి రామకోటేశ్వరరావు, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ సప్పా బలరామకృష్ణ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ నల్లజర్ల వెంకటేశ్వరరావు, క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ సీహెచ్ పాండురంగారావు, క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఎస్.ఉమామహేశ్వరరావు, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ మండే సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.

ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు


కోలమూరులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఉండి: గత ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించిందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. గ్రామ స్థాయిలో విస్తృత సమావేశాలు ఏర్పాటు చేస్తున్న సీపీఐ నాయకులు కూటమి పార్టీ మోసాలను ఎండగడుతున్నారు. శనివారం కోలమూరు, చిలుకూరు గ్రామ కార్యదర్శులు, ఉండితోపుడు బండ్ల శాఖల్లో సీహెచ్ కుమారి, కర్రి సూరిబాబు,గొర్రెల కోటేశ్వరరావులను కార్యదర్శులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామానా సురక్షిత తాగునీరు, వేళాపాళా లేని విద్యుత్ కోతలను నిరోధించాలంటూ గ్రామాల్లో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అన్నీ అస్తవ్యస్తంగా మారాయని మండిపడ్డారు.అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు.

బెంబేలెత్తిస్తున్న రోహిణీ కార్తె ఎండలు

- భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా రహదారులు
- నేటి నుంచి మృగశిర కార్తె ప్రవేశం


పెదతాడేపల్లి కూడలి ప్రాంతం జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రోహిణి కార్తె ఎండలు గత మూడు రోజులుగా తాడేపల్లిగూడెం పట్టణ ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. గత నెల 25వ తేదిన రోహిణి కార్తె ప్రవేశించింది. అయితే నాటి నుంచి పది రోజులు పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఎండా కాలంలో వర్షా కాలం వచ్చిందా ? అనే విధంగా ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. జూన్ నెల ప్రారంభం నుంచి తిరిగి ఎండలు ఊపందుకున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూవచ్చాడు. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత మరింత పెరగడంతో వేడి గాలులు వీయడంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎండ ప్రభావానికి తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడలి ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ప్రధానంగా పోలీస్ ఐలాండ్‌సెంటర్, ఎన్టీఆర్ చౌక్, తాలూకాఫీస్ సెంటర్, గొల్లగూడెం సెంటర్, హౌసింగ్ సెంటర్లు, మండలంలోని పెద తాడేపల్లి కూడలి ప్రాంతాల్లో జనసంచారం లేక వెలవెలబోయాయి. దాదాపు 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి 7.25 గంటలకు సైతం 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు కొనసాగడం గమనార్హం. దీన్ని రోహిణి కార్తె ఎండలు ఆలస్యంగా మొదలైనప్పటికీ తీవ్రత అధికంగానే ఉందని ప్రజలు వాపోతున్నారు. కాగా, మరో రెండు రోజుల్లో మృగశిర కార్తె ప్రవేశించనున్నది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


పైడిపర్రులో ఫ్లుటాస్ ఫార్మ ప్రైవేట్ లిమిటెడ్‌లో కార్మికులకు ఆల్కహాల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: ఆల్కహాల్ అని పేరు ఉన్నవన్నీ మానవుడు సేవించదగ్గవి కావని వాటిలో ఇథైల్ ఆల్కహాల్ మాత్రమే సేవించవచ్చని, మిగిలిన ఆల్కహాల్స్ అన్నీ ప్రమాదకరమని తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్ మణికంఠరెడ్డి పేర్కొన్నారు. శనివారం పైడిపర్రులోని ఫ్లుటాస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో కార్మికులకు ఆల్కహాల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్కహాల్స్ ఉపయోగంతో పాటు కలిగే ప్రమాదాలపట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. ఆల్కహాల్ అన్నీ కార్బన్, ఆక్సిజన్ ,హైడ్రోజన్ సమ్మేళనంతో కూడుకొని ఉంటాయని, ఆల్కహాల్స్‌లో ఇథైల్ ఆల్కహాల్, డినేచర్డ్ ఆల్కహాల్, మిథైల్ ఆల్కహాల్, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్ వంటివి ఉన్నాయని, ఇవన్నీ చూడటానికి వాసన పరంగా ఒకే విధంగా ఉన్నప్పటికీ మానవాళి సేవించడానికి అర్హమైనవి కావన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాస్, ఫ్లుటాస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం పాల్గొన్నారు.

గూడెంలో తాగునీటి కష్టాలు


పంపుల చెరువులో అడుగంటిన తాగునీరు


స్థానిక కాలువలో పొక్లెయిన్‌లతో వ్యర్థాల తొలగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి ఎండల తీవ్రతతో అన్ని ప్రాంతాల్లో నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో పట్టణంలోని పలు మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. పంపుల చెరువు (ఎస్ఎస్ ట్యాంక్) నీరు రోజు రోజుకు అడుగంటుతుంది. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంక్‌లో 8 అడుగుల 9 పాయింట్‌లు రా–వాటర్ ఉంది. మరో 3 అడుగుల రా–వాటర్‌ను మాత్రమే తాగునీరుగా ప్రజలకు అందజేయవచ్చు. ఆ తరువాత ఎస్ఎస్ ట్యాంక్‌లో నీటిని ఉపయోగించేందుకు పనికిరాదు. ప్రస్తుతం పంపుల చెరువులో నీరు ప్రజలకు 6 రోజులకు మించి రాదని అంటున్నారు. ఏప్రిల్ 27వ తేదీ రాత్రి పట్టణం మధ్యగా వెళ్తున్న స్థానిక కాలువను కట్టేశారు. నాటి నుంచి నేటి వరకు ఎస్ఎస్ ట్యాంక్‌లో నీరు ప్రజలకు అందించారు. ఈ నెల ప్రారంభంలో 2, 3 తేదీలలో కాలువను వదలుతారని అందరూ భావించారు. అయితే స్థానిక కాలువలో వ్యర్థాలు తొలగించే కార్యక్రమం ప్రొక్‌లెన్లెయిర్స్‌తో జరుగుతున్నందున నేటికి కాలువను వదలలేదు. కాలువను వదలకపోతే తాగునీటికి పట్టణ ప్రజలతోపాటు నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడతారు. మంచి నీటి అవసరాలకు తప్పక కాలువను వదలాలని లేనిపక్షంలో తాగునీటికి తాము ఇబ్బందులు తప్పవని ప్రజలు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఒకటి లేక రెండు రోజులలో కాలువలోకి నీరు వదులుతారని చెబుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాతలు నోట్ పుస్తకాలు అందించారు. శనివారం విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్ కోసం దాత ధర్మ పరిరక్షణ అధ్యక్షులు గాదె వెంకన్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారం ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు.